# పూల బాసలు

ఆడవాళ్ళనా? అర్థం చేసుకోవడమా? అసాధ్యం అనుకున్నాడు శంకరం.

పెళ్ళయిన రెండేళ్ళలో అమూల్యని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించిన ప్రతి సారీ ఘోరంగా ఫెయిలవుతూనే ఉన్నాడు.

మూర పువ్వులకి రేటేమిటి?

ముప్పావలా నుంచి రూపాయికి పెంచు తున్నట్టు ముసలావిడ చెప్పగానే "రేపట్నించీ పువ్వులు వద్దు" అని చెప్పి మాన్పించేసింది అమూల్య.

"డియర్ అమూల్!పూలకి ఎలా వెల కడతాం? పాపం ఆ ముసిల్ది చాలా రోజులుగా ఇస్తోంది కదా! వాడుక తప్పకుండా... మేడ మెట్లెక్కి మరీ తెచ్చిస్తోంది... రేటు పావలా పెంచిందని వద్దనెయ్యడం ఏం బాగు?... మార్కెట్‌లో అన్ని రేట్లూ పెరిగినట్టే పూలకీ గిరాకీ పెరుగుతుంది కదా!..." అంటూ శంకరం నచ్చ చెప్ప బోయాడు.

"మీకు తెలీదూరుకోండి!" అంటూ ముక్తసరిగా తీర్పు చెప్పేసింది అమూల్య.

అందం, తెలివి, మంచితనం, నిర్మొహమాటం... కలగలిసిన అపురూప వ్యక్తి అమూల్య. అతిగా వాగదు. వాదోపవాదాలు పెంచదు. అనుమానం వస్తే నిలదీస్తుంది. కోపం వస్తే కసురుతుంది. ఇల్లు చక్క దిద్దుతుంది. లెక్కా డొక్కా చూస్తుంది. ఇష్టాన్నీ అయిష్టాన్నీ మాటల్లో చెప్పదు. చేతలతోనే చెప్తుంది.

అమూల్య అంటే శంకరానికి ఇష్టమే కాదు. కొద్దిగా భయం కూడా. ఇష్టాల్నీ భయాల్నీ సరిగ్గా అర్థం చేసుకుంటే జీవితంలో ఎదురయే సమస్యలు సులభంగా పరిష్కారమై పోతాయని శంకరం చాలా సార్లు అనుకుంటాడు.

పువ్వులంటే అమూల్యకు ఇష్టం. కానీ ధర పెరిగి పోయిందని బడ్జెట్‌లో తేడా లొస్తాయని భయం. వంట గ్యాస్ ధర పెరుగుతూనే ఉంది. మానేస్తున్నారూ?

పువ్వులు కొనడం ఎందుకు మానెయ్యాలి?

"మీకు తెలీదు లెండి... గ్యాస్ చాలా పొదుపుగా వాడుతుంటాను. అలాగే పూలు కూడా... రోజూ ముసల్ది తెచ్చివ్వడం... నెలకింత అని ఖర్చు పెట్టడం ఎందుకూ? మనం ఎప్పుడైనా... బయటికి వెళ్ళినప్పుడు కొనా లనిపిస్తే... కొనుక్కుంటాం... అంతే!..." అంటూ తన నిర్ణయాన్ని సమర్థించుకుంది అమూల్య.

ఇంక ఆ టాపిక్ మీద మాట్లాడ్డం వేస్ట్! అందుకే ఊరుకున్నాడు గాని కొద్ది రోజులకే మళ్ళీ పువ్వుల గురించి ఆలోచించాల్సి వస్తుం దనుకో లేదు.

సాయంత్రం హొటల్‌లో కాఫీ తాగి మెట్లు దిగుతుండగా అచ్చమైన నవ్వుల్లాంటి మల్లె పూలు ఎదురొచ్చాయి. "బాబుగారూ... మల్లెపూలండి...బాబు తీసుకోండి బాబు..." తెల్లటి మల్లెల్ని ముందుకు చాచిన చేతులు నల్లగా ఉన్నాయి.

పదారేళ్ళ పిల్ల. రంగు వెలిసిన బట్టలు. సంస్కారం లేని జుత్తు. ఇంకా నల్లటి ముఖం. అయితే మల్లెలతో పోటీ పడేంత స్వచ్ఛమైన నవ్వు. మల్లె పూల సరం లాంటి పలువరస. "తీసుకోండి బాబూ..."

ఆ పిల్ల ముందుకొచ్చి అడుగుతోంది గానీ ఇంకా ఇద్దరు అమ్మాయిలు వెనుకగా నిలబడి చేతుల్లో పూల దండలు సాచి పెట్టి చూస్తున్నారు.

ఆ అమ్మాయి దగ్గర కాకుంటే తమ దగ్గర కొంటాడని వెర్రి ఆశ!

కొద్ది క్షణాల క్రితమే కడుపులో కెళ్ళిన అయిదు రూపాయల కాఫీని తలుచుకుంటూ నల్ల పిల్ల చేతి లోని పూల దండని చూశాడు శంకరం. "ఎంత?"

"మూర... రూపాయి బాబు..."

అంతే. ముసల్ది చెప్పింది రైటే. రేటు ఎక్కడైనా ఒకటే. అయినా పూలకి రేటేమిటి? బేర మేమిటి? అమూల్య లెక్కలు ఎన్నయినా ఉండనీ. శంకరం మనసు చిన్నగా ఊగింది.

మనసున మల్లెల మాల లూగెనే... అంటూ ఏదో కోరస్ వినిపించి నట్లయింది.

మల్లెల దండ ముందుకు సాచి ఆశగా నిలబడ్డ నల్లపిల్ల వాలకంలో జీవితానందమే కదిలినట్లయింది.

"నిజంగా నాకు పూలొద్దమ్మాయ్! నువ్వింతగా అడుగుతున్నా వని కొనాలి అంతే!"

"పోనీ అట్లాగే తీసుకోండి బాబు..."

ఎంత సంబరం! ఎంత సంభ్రమం! ఆ దండ నలక్కుండా ఆకులో కట్టి అపురూపంగా అందించింది అదేదో అరుదైన వస్తువుని ఇస్తున్నట్టు.

పూల పొట్లం స్కూటర్ ముందు బాస్కెట్‌లో పెట్టి పట్టు కెళ్తుండగా ప్రపంచమంతా తననే చూస్తున్నట్టు ఫీలయ్యాడు శంకరం.

ఇంటి కెళ్ళాక పుస్తకాలతో బాటు పూల పొట్లం అల్మయిరాలో పెట్టి స్నానానికి వెళ్ళొచ్చే సరికి అమూల్య పొట్లం విప్పి దండని రెండు చేతుల మధ్య సున్నితంగా పుచ్చుకుని చూస్తోంది.

"ఎక్కడి వండీ పూలు! ఎంత బాగున్నాయి!!"

రోజంతా పడ్డ శ్రమ హుష్ కాకి అయిపోయింది. పూలమ్మిన నల్లపిల్ల దేవతా మూర్తిలాగా మెదిలింది.

"ఎక్కడివీ?... కొంటేనేగా... ఇందాక హోటల్ దగ్గర తీసుకున్నా..." అన్నాడు.

"ఎంత?" అంటుందేమో నని భయ పడ్డాడు.

ఎందుకు కొన్నారు? అంటుం దేమో ననుకున్నాడు.

పూలు అలా వాసన చూసుకుంటూ లోపలికి వెళ్ళి పోయిందే గాని అమూల్య అప్పుడేమీ మాట్లాడ లేదు.

రాత్రి వెన్నెల రెచ్చి పోయింది.

మేడ మీద విశాల మైన డాబా.

ఆరు బైట వేసుకున్న పక్కల మీద వెన్నెల ఇష్టారాజ్యంగా కురిసి దొర్లింది. పొర్లింది.

చాలా పొద్దు పోయాక అలిసి పోయిన శరీరాలు సేద దీరుతుండగా మల్లెదండ జడ నుంచి జారుతూ భుజం మీద నుంచి రొమ్ముల మధ్యకు వచ్చి ఆగింది.

సుతారంగా ముద్దు పెట్టుకుంటూ "మల్లెల మహత్యమేమో! నువ్వివాళ మరీ అద్భుతంగా ఉన్నావు..." అన్నాడు శంకరం.

"కనిపెట్టారు..." అంటూ అతని పెదవుల మీద చాలా సేపు ముద్దు పెట్టు కుంది అమూల్య.

అంత కోరికని అంత ఇష్టాన్నీ ఎక్కడ దాచిందా అనిపించింది.

నలుగుతున్న మల్లె దండ వెన్నెలకే తమకం తెప్పిస్తుండగా లోలోపల

ఆశ్చర్య పోయాడు శంకరం.

అంతరాంతరాల్లో అతనికో కోరిక ఉంది. ఆమెకూ తెలుసు అతనికీ తెలుసు.

అతనికి కాస్త పళ్ళు ఎత్తు. మరీ వికారం కాదు. ఎత్తు. అంతే. ముద్దు పెట్టు కునేప్పుడు కొంచెం ఇబ్బందిగా... పళ్ళు ఎత్తు అని గుర్తొస్తూ ఉంటుంది. పళ్ళ డాక్టర్ దగ్గర సరి చేయించుకో వచ్చు.

కాని ఎందుకో చేయించుకో లేదు.

పెళ్ళయిన కొత్తలో అమూల్య ఒక సారి అంది... "కిస్ చేస్తుంటే... అలర్జీగా అనిపిస్తోంది... ఏదో నొక్కేస్తున్నట్టు... మీ పళ్ళ వల్ల...భయ మనిపిస్తుంది... ప్లీజ్! అపార్థం చేసుకోకండి..."

లేదు. అపార్థం లేదు. అనురాగానికి లోటు లేనప్పుడు ఇటువంటివేం లెక్క.

అలాగైతే ప్రపంచంలో ఎత్తు పళ్ళ వాళ్ళెవ్వరూ కాపురాలే చెయ్యలేరు.

ఆమెను హర్ట్ చెయ్యలేదు. తను హర్ట్ కాలేదు.

కానీ తనువులు మైమరచే అమృత క్షణాలలో ఆ చిన్న లోపాన్ని ఎలాగో సర్దుకుంటున్నారు.

ప్రపంచంలో ఎన్నిటికో రేషన్ ఉంది.

వాళ్ళ ముద్దులకి రేషన్. అప్పుడప్పుడూ కొసరుగా. లాంఛనంగా అంతే!

నల్లపిల్ల చేతి మల్లె దండ సాక్షిగా ఆ రాత్రి ముద్దులకు రేషన్ రద్దయినట్టు అమూల్య అద్భుతంగా అధరామృతం పంచుతుండగా పాల పుంతలో తేలి పోయాడు శంకరం. ఇంటికి వస్తే కొనే పువ్వులు వేరు. మగడు మనసారా తెచ్చిచ్చే పూల మహత్యం వేరు.

తెల్లారి పోయే వేళ అమూల్య చిన్నగా అడిగింది... "ఎవరి దగ్గర కొన్నారేంటి మల్లెపూలు? పడుచు పిల్లేనా? నవ్వుతూ అంటగట్టిందా?"

హాతోస్మి అనుకున్నాడు శంకరం!

తరతరాల ప్రేమ చరిత్రలో అసూయలే విలన్లు!

నల్ల పిల్ల అని చెప్పినా చిక్కులొస్తాయని పించింది.

"ఎవరో గుడ్డి ముసల్ది! పాపం... జాలని పించింది..." అని వేరే మాట మార్చేశాడు.

"అయితే అయింది గాని జాలిని మరీ దుబారా చెయ్యకండి!" అని

చెప్పింది అమూల్య. మరి అంతసేపూ అలరించిన పూలకి అంతేనా విలువ?

మరుసటి రోజు సాయంత్రం వద్దను కుంటూనే పూలు కొన్నాడు శంకరం.

కొన్నాక అమూల్య వద్దనదు.

పైగా ముద్దుల రేషన్ రద్దవుతుంది.

ఖర్చు విషయంలో ఎంత పొదుపు ఉన్నా తన స్వతంత్రాని కేమీ లోటు లేదు.

నల్లపిల్ల ముఖంలో సంతోషం గంతులేస్తోంది.

"బాబుగారు... మీ కోసం పెషల్‌గా కట్టానండి... నేనే కట్టానండి..." అంటూ మూరెడు మల్లెలు మురిపెంగా చుట్టి అందించింది.

పోషణ లేక జాగ్రత్త లేక మోటుగా కనిపిస్తున్న నల్ల చేతులు. పేదరికం లోంచి తొంగి చూడ్డానికి భయ పడుతున్న యౌవనం. పూలకి డబ్బులిస్తూ అప్పుడే గమనించాడు శంకరం.

నల్లపిల్ల చేతిలో బుట్టనిండా ఘుమఘుమ లాడు తున్నాయి మల్లెలు, జాజులు. కాని ఆ అమ్మాయి తల్లో మాత్రం ఒక్క పువ్వూ లేదు.

దువ్వీ దువ్వని జుట్టుని తొందరగా అల్లి ముడేసింది. అంతే!

కొంచెం చనువు తీసుకుంటూ అడిగేశాడు..."మరి... నువ్వెందుకు పెట్టుకోవు పూలు?..."

"అమ్మో...మా అమ్మ తన్నేస్తుంది!"

ఈ మాటలు వింటున్న మరో పూల పిల్ల కిసుక్కున నవ్వింది. "ఇది పూలు పెట్టుకుందో... దవడ వాచి పోతుంది... వాళ్ళమ్మకి నిజంగా చెడ్డ కోపం సారూ!... మా అత్త మాత్రం మంచిది లెండి..." అంటూ తన తలలో సన్న జాజుల దండ గర్వంగా ఊగేట్టు తలెగరేసింది.

చివుక్కు మనిపించింది శంకరానికి.

పూలమ్మే నల్లపిల్ల పూలు పెట్టుకోదు! పెట్టుకో కూడదు! ఎంత ఘోరం!

ఆ రాత్రి చాలా పొద్దు పోయాక శంకరానికి చప్పున నల్లపిల్ల గుర్తొచ్చింది. మల్లెల కన్నా స్వచ్ఛమైన ఆ పిల్ల నవ్వు కళ్ళముందే మెదిలింది.

మీ కోసం పెషల్‌గా కట్టానంటూ ఆ పిల్ల అందించిన మల్లె దండ ఇప్పుడు సుఖ పారవశ్యంతో నిద్రిస్తున్న అమూల్య తలలో ముగ్ధ మోహనంగా

నవ్వుతోంది.

అయితే ఆ పూలు కట్టడంలో స్పెషల్ ఏమిటో శంకరానికి అర్థం కాలేదు.

ఒకటి మాత్రం నిజం. ఆ దండ తలలో పెట్టు కున్నప్పటి నుంచి అమూల్య ధోరణి ఎంతో రొమాంటిక్‌గా మారిపోతుంది.

'శయనేషు రంభా' అంటే ఏమిటో ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది.

ఏ తీగనో పూచి ఈ రాత్రి ఈ పక్కను చేరిన మూరెడు మల్లెలకి ఇంత శక్తి ఉందా అని విస్తుపోయాడు శంకరం.

తమకంగా వంగి పూలని వాసన చూస్తుండగా అమూల్య మగత నిద్రలోనే చేతులు సాచి అతన్ని వాటేసుకుని ముఖం తడిమి పొడి ముద్దులతో అలరించింది.

ఈ కళలు ఇదివరకు ఎప్పుడూ లేవు!

రోజూ నల్ల పిల్ల దగ్గర పూలు కొని తెస్తున్నాడు శంకరం. స్కూటర్ హారన్ వినగానే ముందు కొచ్చి మూరెడు పూలిస్తుంది. నవ్వుతుంది. ఎంత నిర్మలత్వం! ఎంత అమాయకత్వం!

ఈ మల్లెల పుణ్యమాని శంకరం దాంపత్య జీవితంలో సరికొత్త రసవత్తర అధ్యాయం ప్రారంభమైంది.

అసలైన శృంగార సామ్రాజ్యంలో దంపతు లిద్దరూ ముగ్ధ మనోహరంగా విహరించ సాగారు.

తనువులు ఏకమై ఊపిరులు ముడిపడే వేళ ఒకే ఒక్క ప్రేమానుబంధం పరిమళంగా కమ్ముతున్నట్టు...

అది మల్లెల మంత్రం!

ఎందుకైనా మంచిదని అమూల్య దగ్గర నల్లపిల్ల సంగతి చెప్పలేదు శంకరం.

అయితే సందర్భం రాకున్నా... ఓ హెూటల్ దగ్గర మెట్లకింద (గుడ్డి) ముసలి దాని దగ్గర పూలు కొన్నాననీ... ఆమె చిల్లర కోసం పేచీ పెడుతుందనీ... పాపం ఈ వయసులో కష్టపడి పూలమ్మడం చూసి జాలి కలుగుతుందనీ... అందుకే కొనడం ఆపలేకుండా ఉన్నాననీ... ఇలా రకరకాలుగా చెప్తూనే ఉ న్నాడు.

అమూల్య వైఖరిలో మార్పు బాగా వచ్చిం దనిపించింది. పూల ఖర్చుని

పట్టించుకోవడం లేదనిపించింది. లేక, ఆ ఖర్చుని మించిన ఫలితం దక్కుతోందని మురిసిపోతోం దేమో!

అయినా భర్త స్వయంగా తెచ్చిచ్చే పూలకి ఖరీదు కట్టే షరాబెవడు?

ఆ రోజు సాయంత్రం... శంకరానికి పెద్ద షాక్!

హొటల్ దగ్గర నల్లపిల్ల కనిపించలేదు.

చందమామకు చల్లదనం అరువిచ్చేంత చల్లటి నవ్వూ మూరెడు పువ్వులూ ఎదురవ లేదు. పూలమ్మే మిగతా అమ్మాయిలు పోటీ పడి వచ్చారు...

షాక్ మీద షాక్. నల్లపిల్ల లేదు. అంటే ఊళ్ళో లేదు. వెళ్ళి పోయింది. బహుశా ఎవరితోనో లేచిపోయింది అంటున్నారు.

వాళ్ళమ్మ తిట్టి కొట్టి పెళ్ళి చేయబోయింది.

బలవంతపు పెళ్ళి.

ఆటో డ్రైవర్‌కిచ్చి ముడి పెట్టడానికి అంతా నిర్ణయ మైపోయింది. ఆ బావ పచ్చి తాగుబోతు. తిరుగుబోతు. ఇంట్లో ఉంటే కట్టేసి అయినా పెళ్ళి చేసేస్తారు. తప్పదు.

అందుకే నల్ల పిల్ల వెళ్ళిపోయింది. మూడో వీధిలో కిళ్ళీబడ్డీ కుర్రాడు కూడా కనిపించడం లేదు. బహుశా ఆ పిల్లను లేవదీసుకు పోయాడేమో!

నల్ల పిల్ల కనిపిస్తే చంపేస్తా నంటోంది వాళ్ళమ్మ. అందుకే నల్ల పిల్ల ఇక రాదు.

"బాబుగారు... మా దగ్గర తీసుకోండి పూలు..."

శంకరం మనసు అగాధంలో పడిపోయింది.

పువ్వులు కొన బుద్ధి కాలేదు. కొనలేదు.

అమూల్య అడగలేదు. అలా అడగ లేదు. ఎందు కడుగుతుంది?

"ఏమండీ... ఆఫీసులో పనెక్కు వైందా పాపం....?"

"ఆc..."

మామూలు మాటలు మామూలు పనులతో రాత్రయింది. డాబా మీద శృంగార సామ్రాజ్యం మూగబోయిన ట్లయింది.

"పాపం బాగా అలిసి పోయిన ట్టున్నారు..."

అమూల్య నిజంగా అమూల్యమైన మనిషి అనుకున్నాడు శంకరం.

తను మామూలు మనిషే. ఆమె దేవత! మల్లెలు లేని లోటు తెలీకుండా గడిపాడు గాని తెల్లారే వేళకి ఆ తేడా ఎలాగూ తెలిసింది. ముద్దులకి రేషన్ వచ్చింది!

చిత్రమేమిటంటే ఆ లోటు ఇప్పుడు అమూల్యను కూడా బాధిస్తోంది!

అన్ని పనుల మధ్య అమూల్య పొడి పొడి మాటల్తోనే అడిగింది...

"ఏంటి... ఆఫీస్ నుంచి వచ్చే రూటు మార్చారా?..."

"పూల ముసల్ది కనిపించడం లేదా?"

"శ్రీవారికి నా మీద కోపమొచ్చి నట్టుంది..."

దేనికీ సూటిగా జవాబు చెప్పలేదు శంకరం. ఒకే ఒక్క సారి మాత్రం... "ఏంటో...పూలు కొనా లనిపించడం లేదు..." అన్నాడు.

నెల తిరిగి పున్నమి వచ్చే సరికి ఆకాశం కొత్త పెళ్ళి కూతురిలా కళ కళ లాడి పోతోంది.

ఈ రాత్రంతా వెన్నెలే తాగి బతకొచ్చు... భోజనాలే వద్దు అనుకుంటూ శంకరం పక్క మీద వాలే సరికి...

బారెడు మల్లెల్ని మూరలుగా మడిచి తలలో జార్చుకుని వచ్చింది అమూల్య.

వెన్నెల తరగల్లో కర్పూరం జల్లినట్టు గుప్పుమంది.

శంకరం అంతరాంతరాల్లో ప్రణయోద్వేగం ఉవ్వెత్తున ఎగసి పడింది.

అమాంతం అమూల్యని వాటేసుకుని గాఢంగా చుంబిస్తూ "సారీ ఇన్ని రోజులూ పూలు తీసుకు రాలేదు... ఎందుకంటే ఒక విషయం గిల్టీగా ఫీలయ్యాను... ఇంకా ఫీలవుతున్నాను..."

"మీరు పూలు కొంటున్నది ఒక గుడ్డి ముసలి దాని దగ్గర కాదు... ఎవరో పడుచమ్మాయి దగ్గర! కదూ?..." అంది అమూల్య.

"వ్వాట్?... నీకెలా తెలుసు? ఎవరైనా చెప్పారా? ఆరా తీశావా?" ఉలికి పాటును కంట్రోల్ చేసుకుంటూ అడిగాడు.

"లేదు... ఎవ రెలాంటి పూలిస్తారో నాకు తెలుసు... చూడండి... ఇవాళ ఈ పూల దండ... నేను కట్టిందే... విడి పూలు కొని మధ్యాహ్న మంతా కూచుని కట్టాను... బాగుందా? అచ్చం ఆ అమ్మాయి... అదే... మీ పూలమ్మాయి కట్టినట్టే కట్టాను కదూ! లేదా?..."

ఏదో ఆలాపన శంకరం చెవుల్లో కోరస్‌లా మోగింది.

"మీ కోసం పెషల్‌గా కట్టాను బాబు..." అనే నల్లపిల్ల మాట ప్రతి ధ్వనించింది.

పూలబాసలు తెలుసు నా యెంకికీ అని... ఎక్కడో విన్న పాట...

"అమూల్! అమూల్!... ఇదంతా ఎట్లా తెలుస్తుం దసలు?... ఎట్లా?..." అయోమయంగా చూస్తున్న శంకరం కళ్ళల్లో వెన్నెల పిచ్చిగా విచ్చుకుంటోంది.

"మీరేం కంగారు పడకండి... ఆ అమ్మాయి గురించి నేనేమీ అడగను..." అని అమూల్య తుంచేస్తున్నా ముక్కలు ముక్కలుగా చెప్పాల్సిం దంతా చెప్పాడు శంకరం.

అంతా విని "డోంట్ వర్రీ! మంచి మనసున్న వాళ్ళకి ఎక్కడైనా మంచే జరుగుతుంది... ఆ అమ్మాయి ఎక్కడున్నా హాయిగా ఉంటుంది... మల్లెల మీద ఒట్టు!" అంది అమూల్య.

ఆ మాట నిజమన్నట్టు మల్లెల వెన్నెల కురిపిస్తూనే ఉన్నాడు జాబిల్లి వాళ్ళిద్దరికీ....

ప్రతి రాత్రీ.

12.12.1997 సంచిక